సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023

'బీఎస్సీ అలైడ్' అడ్మిషన్లు పూర్తి

ఆదిలాబాద్‌టౌన్: రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో బీఎస్సీ అలైడ్ కోర్సులకు సంబంధించి రెండో విడత అడ్మిషన్లు సోమవారం పూర్తయ్యాయి. ఇదివరకు మొదటి విడత కౌన్సెలింగ్ జరిగింది. రెండు విడతల్లో కలిపి 57 మందికి సీట్లు కేటాయించగా, 44 మంది అడ్మిషన్లు పొందినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జెడ్పీ సర్వసభ్య సమావేశం ఈ నెల 23న ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు సీఈఓ గణపతి ప్రకటనలో తెలిపారు. చైర్మన్ రాథోడ్ జనార్దన్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

గరిష్టం/కనిష్టం
27.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఐడీలు కేటాయించి వేతనాలు చెల్లించాలి



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన వీఆర్‌ఏలు

కైలాస్‌నగర్: తమకు ఎంప్లాయ్ ఐడీలు కేటాయించడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని వీఆర్‌ఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు వీఆర్‌ఏలు మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో వీఆర్‌ఏలుగా పనిచేసిన తమను బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్కేల్ ఉద్యోగులుగా ప్రకటించి వివిధ శాఖల్లో జూనియర్, రికార్డు అసిస్టెంట్లు, చైన్‌మెన్‌లు, ఆఫీస్ సబార్డినేట్లుగా నియమించిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 81,85 ప్రకారం ఐదు నెలలుగా కేటాయించిన శాఖల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. అయితే గత ప్రభుత్వం ఎంప్లాయ్ ఐడీలను కేటాయించకపోగా, వేతనాలు కూడా చెల్లించలేదన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ సమస్యలు గుర్తించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ మండలాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కబడ్డీ శిక్షణ శిబిరం షురూ

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్-14 బాలుర కబడ్డీ శిక్షణ శిబిరం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో త్వరలో నిర్వహించనున్న జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు సంబంధించి క్రీడాకారులను సంసిద్ధం చేసేలా శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు పేర్కొన్నారు. పీఈటి నాందేవ్ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

స్వాగత ద్వారం అదుర్స్



స్వాగత ద్వారం వద్ద ఎన్‌సీసీ కేడెట్లతో డీఎం కల్పన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్వాగత బోర్డులు ఆకట్టుకుంటున్నాయి. ప్రయాణికులను ఆకర్షించేలా తెలుగు, ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల్లో వీటిని ఏర్పాటు చేశారు. అలాగే ద్వారానికి రెండు వైపులా ఐ లవ్ టీఎస్ ఆర్టీసీ, స్వాగతం-సుస్వాగతం అంటూ ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి.

షెడ్యూలు వివరాలు..

కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తుల స్వీకరణ: వచ్చే ఏడాది జనవరి 5 వరకు..
ముసాయిదా జాబితా : జనవరి 6, 2024
మార్పులు, చేర్పులకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ: జనవరి 6- జనవరి 22, 2024
(ఏదైన ఒక శని, ఆదివారం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి)
అభ్యంతరాలు, క్లెయిమ్స్ పరిష్కరించాల్సిన గడువు : ఫిబ్రవరి 2, 2024
ఓటర్ల తుది జాబితా ప్రకటన : ఫిబ్రవరి 8, 2024



మరో చాన్స్

- 18 ఏళ్లు నిండిన యువత ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోండి
- మార్పులు, చేర్పులకు సైతం అవకాశం

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్య మనుగడకు ఓటు వజ్రాయుధం. అలాంటి ఓటు హక్కు అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలనేదే ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశం. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ షురూ అయ్యే వరకు ఓటరు నమోదుకు ఈసీ అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. తాజాగా పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని ఓటరు జాబితా సవరణపై మరోసారి దృష్టి సారించింది. 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. అయితే ఈ ప్రక్రియపై ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన యంత్రాంగం ఆ దిశగా కార్యాచరణ చేపట్టకపోవడం గమనార్హం. కనీసం ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రతి ఒక్కరూ పొందాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపడుతుంది. వచ్చే ఏడాది (2024)జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువత ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. అలాంటి వారు ఫారం-6 ద్వారా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్లలోనూ నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఈ దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగా అందించవచ్చు. ఆన్‌లైన్‌లో నేషనల్ ఓటర్స్ సర్వీసెస్ పోర్టల్ http:// www. nvsp. in, తెలంగాణ ఎన్నికల సంఘం నిర్దేశించిన ceotelangana. nic. in ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముంది.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో..

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసినప్పటికీ రానున్న ఆరు నెలల వ్యవధిలో వరుస ఎన్నికలు కొనసాగే అవకాశం ఉంది. స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలు వరుసగా జరిగే అవకాశముంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈసీ ఇప్పటికే అవసరమైన కసరత్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో 2024ను ఎన్నికల సంవత్సరంగా చెప్పుకోవచ్చు.

కొరవడిన ప్రచారం

కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు, చేర్పులతో కూడిన జాబితా సవరణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజుల క్రితమే ప్రారంభమైంది. దీనిపై ఈసీ అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన యంత్రాంగం నిమ్మకు నిరెత్తనట్లుగా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వీలైనంత మంది యువత ఓటర్లుగా నమోదయ్యే అవకాశముంది.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ తదితరులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

కైలాస్‌నగర్: ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఓటరు ధ్రువీకరణ, ఓటరు జాబితా తయారీ వంటి అంశాలపై సోమవారం ఆయన ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 1450 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా ఆయా కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ చేయాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, మరణించిన ఓటర్ల వివరాలు తొలగింపు, జాబితాలో ఉన్న పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా జాబితా, చిరునామా, జీఐఎస్ ద్వారా క్యాప్చరింగ్, ప్రత్యామ్నాయ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు జాబితా సమాచారాన్ని సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. జనవరి 6, 2024న ముసాయదా ఓటరు జాబితా విడుదల చేసి, జనవరి 22 వరకు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. ఫిబ్రవరి 2 లోగా వాటిని పూర్తి స్థాయిలో పరిష్కరించి, ఫిబ్రవరి 8న తుది జాబితా రూపొందించాలని ఆదేశించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా రూపకల్పన కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఆర్డీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకమని, ఇదే స్ఫూర్తితో రానున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం కావాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంపై అధికారులను అభినందించారు. జనవరిలో నిర్వహించనున్న పంచాయతీ ఎన్నికలకు అవసరమైన కసరత్తు పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలలు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది సమాచారాన్ని యుడైస్ ప్లస్ పోర్టల్‌లో ఈనెల 15లోపు నమోదు చేయాలన్నారు. ఈ సమాచారం ప్రాతిపదికనే ప్రభుత్వం సౌకర్యాలను సమకూరుస్తుందన్నారు. సమావేశంలో ఆర్డీవో స్రవంతి, డీఆర్డీవో కిషన్, డీఈవో టి.ప్రణీత, మున్సిపల్ కమిషనర్ శైలజ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- ప్రజావాణి మళ్లీ షురూ
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్

కైలాస్‌నగర్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రెండు నెలల పాటు నిలిచిపోయిన ప్రజావాణి అర్జీల స్వీకరణ మళ్లీ షురూ అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా సోమవారం తిరిగి ప్రారంభమైంది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గతంలో పలుమార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కాని బాధితులు తరలివచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. ఓపిగ్గా విన్న కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన..

పాత జీపీలోనే కొనసాగించాలి



మేమంతా తలమడుగు మండలం ఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని షేర్‌గూడ, టొక్కిగూడ గ్రామస్తులం. పంచాయతీ పునర్వీభజన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు మా గ్రామాలను ఝరి పంచాయతీలో కాకుండా మూడు కిలో మీటర్ల దూరంలో నుండే కొత్తగా ఏర్పడే పునగూడలో కలిపేలా ఉన్నతాధికారులకు పంపించారు. ఆ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. వెళ్లేందుకు ఇబ్బందవుతుంది. పాత పంచాయతీలోనే మా గూడేలను కొనసాగించాలి.

– టొక్కిగూడ శేర్‌గూడ గ్రామస్తులు

విద్యుత్ కనెక్షన్ ఇవ్వట్లేదు



కేంద్ర ప్రభుత్వ స్కీం పీఎంఎఫ్ఎంఈ కోసం దరఖాస్తు చేసుకోగా రూ.2లక్షల రుణం మంజూరు చేశారు. దీంతో ఫ్లోర్ మిల్ కొనుగోలు చేశాను. దాని నిర్వహణకు అవసరమైన విద్యుత్ కనెక్షన్ మీటర్ కోసం నాలుగు నెలల క్రితం దరఖాస్తు చేశాను. ఇప్పటి వరకు మీటర్ ఇవ్వలేదు. అడిగితే రేపు, మాపంటూ అధికారులు దాట వేస్తున్నారు. త్వరగా కనెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– మంజూషా, చెప్రాల, బేల

బోరుబావులను అడ్డుకుంటున్నారు



హర్కాయి గ్రామానికి చెందిన మాకు గ్రామ శివారులో వ్యవసాయ భూములున్నాయి. వాటికి పట్టాలతో పాటు అటవీ హక్కు పత్రాలు కూడా ఉన్నాయి. మా భూముల్లో రెండో పంటల సాగు కోసం బోరుబావులు తవ్వుకునేందుకు వెళితే అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నా రు. మాపైనే అక్రమంగా కేసులు పెడుతున్నారు. దీనిపై చర్యలు తీసుకుని మా భూముల్లో బోరుబా వులు తవ్వుకునేలా అవకాశం కల్పించి ఆదుకోవాలి. –హర్కాయి గొండు గిరిజనులు, బజార్‌హత్నూర్

పోలీస్ శిక్షణ ప్రారంభించాలి



మేమంతా 2022లో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యాం. మెడికల్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ప్రభుత్వం దాన్ని నిలిపివేసింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం త్వరితగతిన మెడికల్ టెస్టులు నిర్వహించి శిక్షణను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– కానిస్టేబుల్‌కు ఎంపికైన అభ్యర్థులు

గొర్రెలు పంపిణీ చేయాలి



మేము మావల మండలం బట్టిసావర్‌గాంవ్‌లోని యాదవ కులస్తులం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ స్కీం కింద ఒక్కొక్కరం రూ.43,750 చొప్పున డీడీలు చెల్లించాం. ఏళ్లు గడుస్తున్నా గొర్రెలను పంపిణీ చేయడం లేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి త్వరగా గొర్రెల అందించేలా చర్యలు చేపట్టాలి.

– యాదవ కులస్తులు, బట్టిసావర్‌గాంవ్

బడి బయట పిల్లలెందరు..

- జిల్లాలో సర్వే షురూ
- జనవరి 10 వరకు ఇంటింటికీ..
- 59 సీఆర్పీలతో వివరాలు సేకరణ
- ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు
- గుర్తించిన వారిని సమీప పాఠశాలల్లోకి..



బడి బయట పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: బాల్యం బందీ అవుతోంది. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన చేతులు ఇటుక బట్టీలు, చెత్త కుప్పల్లో దర్శనమిస్తున్నాయి. విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం బడి బయట పిల్లల సర్వే చేపడుతున్నప్పటికీ అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదనే విమర్శలున్నాయి. ఏటా తగ్గాల్సిన సంఖ్య పెరుగుతూ పోతోంది. విద్యా హక్కు చట్టం ప్రకారం 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండాలి. జిల్లాలో పరిస్థితి మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పంట చేలల్లో, పశువులు మేపుతూ కనిపిస్తున్నారు. పట్టణాల్లో అయితే మెకానిక్ షెడ్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్ తదితర ప్రాంతాలు వీరికి కేరాఫ్‌గా మారుతున్నాయి. ఈ ఏడాది కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2024 జనవరి 10 వరకు సీఆర్పీల ద్వారా సర్వే చేపట్టనున్నారు.

ప్రారంభమైన సర్వే..

జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 987 ప్రాథమిక, 189 ప్రాథమికోన్నత, 267 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 1,443 ఉన్నాయి. ప్రైవేట్‌తో కలుపుకొని 1లక్ష 32వేల 45 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా ఈనెల 10 నుంచి జనవరి 10 వరకు సర్వే కొనసాగనుంది. ఈ సర్వేను ఆయా క్లస్టర్ల పరిధిలోని సీఆర్పీలు చేపడుతున్నారు. ఇందుకోసం 59 మంది సీఆర్పీలు, 17 మంది ఎంఐఎస్ కోఆర్డినేటర్లను నియమించారు. సీఆర్పీలు ఇంటింటికి తిరుగుతూ పిల్లల వివరాలు సేకరిస్తున్నారు. ఏ కారణాలతో పిల్లలు బడికి వెళ్లడం లేదనే వివరాలు నమోదు చేసుకుంటున్నారు. సంబంధిత మండల విద్యాధికారి కార్యాలయంలో ప్రబంధ్ పోర్టల్‌లో ఎంఐఎస్ కోఆర్డినేటర్ ద్వారా నమోదు చేస్తారు. వీరితో పాటు 15 నుంచి 19 ఏళ్ల లోపు వారు వివిధ కారణాలతో చదువుకు దూరమైతే వారి వివరాలు సైతం సేకరిస్తున్నారు. ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదివే విధంగా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి చదువు పునఃప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నారు.

ఈసారైనా పకడ్బందీగా చేపట్టేనా..

ఏటా సీఆర్పీలతో బడి బయట పిల్లల సర్వే చేపడుతున్నారు. జిల్లాలో ఈ సర్వే తూతూమంత్రంగా సాగుతోందనే విమర్శలున్నాయి. కొంత మంది సీఆర్పీలు క్షేత్రస్థాయిలో తిరగకుండా ఇంటి వద్దనే కూర్చొని రికార్డులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దీంతో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించి వారికి విద్యాబుద్ధులు నేర్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆయా పాఠశాలల్లో పనిచేసే కొంత మంది ఉపాధ్యాయుల పోస్టులను రక్షించేందుకు పిల్లలు బడిలో లేకపోయినప్పటికీ ఉన్నట్లు హాజరు వేస్తున్నారు. పిల్లలు మాత్రం బయట తిరుగుతూ దర్శనమిస్తున్నారు. అలాగే సర్వేలో గుర్తించిన పిల్లలను బడిలో చేర్పించినప్పటికీ ఆ తర్వాత వారు పాఠశాలకు వస్తున్నారా.. లేదా అనే దానిపై పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారుతోంది. గతేడాది అధికారుల లెక్కల ప్రకారం.. 279 మంది పిల్లలు బడియబట ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. వారిని పాఠశాలల్లో చేర్పించినప్పటికీ ఇందులో సగం కంటే ఎక్కువ మంది బడి మానేసినట్లు తెలుస్తోంది.

1ఇటుక బట్టీల్లోనే..

జిల్లాలో చాలా మంది పిల్లలు ఇటుక బట్టీలు, చెత్త ఏరుతూ కనిపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికుల పిల్లలతో పాటు జిల్లాకు చెందిన ఇటుకబట్టీ కార్మికులు ఊరు బయట పంట పొలాల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. వారి పిల్లలు అక్కడే ఉంటూ ఈ పనుల్లో నిమగ్నమవుతున్నారు. నిబంధనల ప్రకారం ఇటుకబట్టీల్లో పనిచేసే వారి పిల్లలను కార్మిక, విద్యా శాఖలు పట్టించుకోవడం లేదు. దీంతోపాటు బాలల హక్కుల పరిరక్షణ సంస్థ వారు కూడా చూసిచూడనట్లుగా వ్యవహరించడంతో పిల్లల భవిష్యత్తు అంధకారంగా మారుతోంది.

పకడ్బందీగా సర్వే

బడి బయట పిల్లల సర్వే పకడ్బందీగా చేపడుతున్నాం. సీఆర్పీలు వారి క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ తిరుగుతూ చదువుకు దూరమైన పిల్లలను గుర్తిస్తున్నారు. జనవరి 10 వరకు ఈ సర్వే కొనసాగుతుంది. సిబ్బంది 6 నుంచి 14 ఏళ్లోపు పిల్లలను గుర్తించి వివరాలు ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. 15 నుంచి 19 ఏళ్లలోపు వారు చదువుకు దూరమైనట్లయితే వారిని గుర్తించి పదో తరగతి, ఇంటర్ విద్య పూర్తి చేసేలా చర్యలు చేపడతాం. ఎంఈవోలు, సీఆర్పీలు, సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులతో ఇప్పటికే సమావేశం నిర్వహించాం. ఎక్కడైనా బడి బయట పిల్లలు ఉన్నట్లు సమాచారం అందిస్తే వారిని బడిలో చేర్పించేలా చర్యలు చేపడతాం.

– ప్రణీత, డీఈవో

నేతలొచ్చిన చోటా.. గెలుపోటములు

- ప్రధాని మోదీ వచ్చిన నిర్మల్‌లో బీజేపీ విజయం
- రాహుల్ వచ్చిన ఆదిలాబాద్‌లో ఓటమి
- ప్రియాంక రెండు చోట్ల పర్యటిస్తే.. ఒకచోట గెలుపు
- రేవంత్ ఐదు నియోజకవర్గాల్లో పర్యటిస్తే.. రెండుచోట్ల హవా
- కేసీఆర్ తొమ్మిది చోట్ల పర్యటిస్తే.. బోథ్, ఆసిఫాబాద్‌లోనే గెలుపు



ఆదిలాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: ఎన్నికలు ముగిశాయి.. కొత్త శాసనసభ కొలువుదీరింది. గెలిచిన ఎమ్మెల్యేల్లో బీజేపీ మినహా మిగతా వారు ప్రమాణస్వీకారం చేశారు. ఇక ఈ ప్రక్రియ పూర్తయింది. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముఖ్య నేతలు పర్యటించిన చోట గెలుపోటములను పరిశీలిస్తే మిశ్రమ ఫలితాలు ఉన్నాయి.

పశ్చిమ జిల్లాలో ..

ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్‌లో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి మహేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిచారు. ఈ నియోజకవర్గంలో కేసీఆర్, రేవంత్ కూడా పర్యటించారు. వారికి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటించారు. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటల వంటి ముఖ్య నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి పాయల్ శంకర్ ఇక్కడ గెలుపొందారు. బీఆర్‌ఎస్ పరంగా కేసీఆర్, హరీశ్‌రావు, కాంగ్రెస్ పరంగా రేవంత్‌రెడ్డి తదితరులు విచ్చేశారు. బోథ్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తరఫున ఇచ్చోడలో నిర్వహించిన సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలుపొందింది. ముథోల్ నియోజకవర్గంలో బీజేపీ తరఫున బండి సంజయ్, ఈటల రాజేందర్ ప్రచారం నిర్వహించారు. ఇక్కడ ఆ పార్టీ గెలుపొందింది. కాంగ్రెస్ తరఫున మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌రావు చౌహాన్ ప్రచారం చేశారు. అయితే కాంగ్రెస్‌కు ప్రతికూల ఫలితం వచ్చింది. ఖానాపూర్‌లో కాంగ్రెస్ తరఫున ప్రియాంక గాంధీ, అంతకుముందే రేవంత్ రెడ్డి బహిరంగ సభలు జరిగాయి. ఇక్కడ కాంగ్రెస్ గెలుపొందింది. ఇక బీఆర్‌ఎస్ తరఫున కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు పర్యటించారు. బీజేపీ తరఫున సంజయ్ పర్యటించారు. ఈ రెండు పార్టీలకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి.

తూర్పు జిల్లాలో..

మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ ముఖ్య నేతలెవరు ప్రచారంలో పాల్గొనకపోయినా ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్‌సాగర్ రావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. బీఆర్‌ఎస్ తరఫున కేసీఆర్ బహిరంగ సభ, కేటీఆర్ రోడ్‌షో, బీజేపీ తరఫున అమిత్‌షా రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ రెండు పార్టీలకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున ముఖ్య నేతలు ఎవరు ప్రచారం నిర్వహించలేదు. తీన్మార్ మల్లన్న ఇక్కడ పర్యటించారు. చెన్నూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ గెలుపొందారు. బీఆర్‌ఎస్ తరఫున కేటీఆర్, హరీశ్‌రావు పర్యటించారు. బీజేపీ తరఫున ముఖ్యనేతలు ఎవరు పాల్గొనలేదు. ఈ రెండు పార్టీలకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. బెల్లంపల్లిలో కాంగ్రెస్ తరఫున రేవంత్ పర్యటించారు. ఇక్కడ ఆ పార్టీ అభ్యర్థి గడ్డం వినోద్ విజయం సాధించారు. బీఆర్‌ఎస్ తరఫున కేసీఆర్ పర్యటించారు. ప్రతికూల ఫలితం దక్కింది. ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ తరఫున కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి గెలుపొందారు. కాంగ్రెస్ తరఫున ప్రియాంక గాంధీ బహిరంగ సభ నిర్వహించినప్పటికీ ఫలితం దక్కలేదు. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో బీజేపీ తరఫున ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యటించారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్‌బాబు గెలుపొందారు. బీఆర్‌ఎస్ తరఫున కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొన్నప్పటికి ప్రతికూల ఫలితం వచ్చింది.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన యువతి అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సదరు యువతి రాత్రి వరకు కూడా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. సోమవారం యువతి తండ్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యం మత్తులో వృద్ధుడు ఆత్మహత్య

జైనథ్: మద్యం మత్తులో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గొల్ల రాములు (70), గొల్ల భాగీర్తబాయి దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా రాములు మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగేవాడు. సోమవారం కూడా మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగడంతో బయటకు వెళ్లిపోయింది. ఆ తర్వాత ఇంటికి వచ్చి చూడగా దూలానికి ఉరేసుకుని కనిపించాడు. భాగీర్తబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


భీమేశ్(ఫైల్)


దిలావర్‌పూర్(నిర్మల్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాడేగాం గ్రామానికి చెందిన సుంకరి భీమేశ్(35) రెండేళ్ల క్రితం అప్పులు చేసి ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. చాలీచాలని వేతనంతో కుటుంబ పోషణ భారం కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మంత్రిని కలిసిన బాసర ఆలయ ఈవో


పుష్పగుచ్ఛం ఇస్తున్న ఈవో విజయరామారావు

భైంసా: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి కొండా సురేఖను సోమవారం బాసర ఆలయ ఈవో విజయ రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బాసర ఆలయానికి రావాలని ఆహ్వానించారు. త్వరలోనే బాసర ఆలయానికి వచ్చి సమీక్ష నిర్వహిస్తానని మంత్రి తెలిపినట్లు ఈవో వెల్లడించారు.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ


బాసర ఆలయంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పూజలు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సోమవారం దర్శించుకున్నారు. బాసరకు వచ్చిన మాజీ ఎంపీకి బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. నా యకులతో కలిసి వెళ్లినరాథోడ్ రమేశ్ సరస్వతీ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ఆల య అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

సర్కారుబడిలో.. క్రీడా కెరటాలు

- జోనల్ స్థాయిలో నిర్మల్ జిల్లా విద్యార్థుల ప్రతిభ
- రాష్ట్రస్థాయికి ఎంపికైన పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- రగ్బీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో రాణింపు

నిర్మల్ ఖిల్లా: వారంతా సర్కారు బడిలో చదువుతున్న దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు. కానీ క్రీడా ప్రాంగణంలో దిగితే మాత్రం వారంతా చిరుతలే. లక్ష్యంతో గురిచూసి బాల్ కొడితే బాస్కెట్‌లో పడాల్సిందే. రగ్బీ ఆటలో సైతం ముచ్చట గొలిపే పట్టు వారిది. ఇక ఖోఖోలో సైతం చిచ్చరపిడుగులే. ప్రతిభకు పేదరికం, సౌకర్యాల లేమి అడ్డురావని నిరూపిస్తున్నారు జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు. సామాన్య కుటుంబాల నుంచి ఎదుగుతున్న వీరు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. తమ నైపుణ్యానికి పదునుపెడితే జాతీయస్థాయిలో కూడా సత్తా చాటుతామంటున్నారు. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారుల అభిప్రాయాలతో సాక్షి కథనం...

రగ్బీ ఆటలో రాష్ట్రస్థాయికి...

ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన అండర్–14 క్రీడ పోటీల్లో జిల్లా కేంద్రంలోని కస్బా ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎనిమిదో తరగతి చదువుతున్న సాయిచంద్, విగ్నేష్ అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు వాణి, వ్యాయామ ఉపాధ్యాయుడు భూమన్న ప్రోత్సాహం, శిక్షణతో రగ్బీ ఆట లో సత్తా చాటుతున్నామని వారు పేర్కొంటున్నారు.


బాస్కెట్‌బాల్ ఆడుతున్న తిమ్మాపూర్ విద్యార్థులు

బాస్కెట్‌బాల్ పోటీల్లో తిమ్మాపూర్ విద్యార్థులు..

భైంసా మండలంలోని తిమ్మాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని నిషిత, ఏడవ తరగతి విద్యార్థి శశికాంత్ బాస్కెట్ బాల్ పోటీల్లో రాణిస్తున్నారు. వీరు ఇటీవల మంచిర్యాలలో జరిగిన జోనల్ స్థాయి అండర్– 14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఇక్కడి వ్యాయామ ఉపాధ్యాయుడు డేవిడ్ బెనహర్‌తో పాటు ప్రధానోపాధ్యాయురాలు సరిత విద్యార్థులకు క్రీడలపై తగిన ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఆష్టా బాలికలు రాష్ట్రస్థాయికి...

ముథోల్ మండలంలోని ఆష్టా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన తొమ్మిది మంది బాలికలు రాష్ట్రస్థాయి అండర్–18 ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇక్కడి ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణ, గ్రామ వీడీసీ సభ్యులు విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహిస్తున్నారు.

టెన్నీకాయిట్‌లో సైతం..

సోన్ మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జోనల్‌స్థాయి టెన్నీకాయిట్ క్రీడల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

నిరంతర సాధనతోనే రాణింపు...



విద్యార్థులను ఉదయం, సాయంత్రం రెండు పూటలా రగ్బీ క్రీడలో సాధన చేయిస్తున్న దీని ద్వారానే తగిన శిక్షణ లభిస్తుంది. తద్వారా విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించేలా ప్రోత్సహిస్తున్నాం. దానికి అనుగుణంగా విద్యార్థులు కూడా అదే రీతిలో శ్రమిస్తున్నారు.

– వి.భూమన్న, ఫిజికల్ డైరెక్టర్, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

చదువుతోపాటు క్రీడలు అవసరమే...



చదువుతో పాటు క్రీడల్లో రాణించడం విద్యార్థులకు అవసరం. క్రీడలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. అదే రీతిలో మా పాఠశాల విద్యార్థులను చదువుతోపాటు ఆటల్లోనూ నైపుణ్యం సాధించేలా చూస్తున్నాం. శారీరక మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయి.

– వాణి, ప్రధానోపాధ్యాయురాలు, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

కఠోర సాధనతోనే...



విద్యార్థుల కఠోర శ్రమతో సాధన చేయడంతోనే రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారు. తిమ్మాపూర్ పాఠశాలలో విద్యార్థులు బాస్కెట్‌బాల్ క్రీడలో నిరంతరం ఆసక్తి కనబర్చుతుండడంతో వారికి ఈ ఆటలో శిక్షణ ఇస్తున్నాను. దీంతో వారు కూడా బాస్కెట్‌బాల్ క్రీడలో మెలకువలను నేర్చుకోవడానికి ఇష్టపడుతున్నారు. మా ప్రధానోపాధ్యాయులు సరిత మేడమ్ కూడా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

– డేవిడ్ బిన్హర్, పీఈటీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తిమ్మాపూర్

సార్ల ప్రోత్సాహంతోనే...



మా ప్రధానోపాధ్యాయురాలు వాణి, ఫిజికల్ డైరెక్టర్ భూమన్న సారు ప్రోత్సాహంతోనే రగ్బీ ఆటలో రాణిస్తున్నాం. బడిలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేస్తున్నాం. ఇందులో మెలకువలను నేర్పుతున్నారు. జోనల్‌స్థాయి లాగే రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటుతామనే నమ్మకం ఉంది.

– సాయిచంద్, 8వ తరగతి, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

అవకాశాలను అందిపుచ్చుకుని..



పాఠశాల స్థాయిలో ప్రతిరోజు శిక్షణతో రగ్బీ ఆటలో నైపుణ్యం సాధిస్తున్నాం. వ్యాయామ ఉపాధ్యాయులు ఈ ఆటలో రాణించేలా మెలకువలను నేర్పిస్తున్నారు. పాఠశాల, జోనల్ స్థాయిలో అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నాం. ప్రతిభను గుర్తించడంతో మరింత ఉత్సాహం లభిస్తుంది.

– విఘ్నేష్, 8వ తరగతి, కస్బా ఉన్నత పాఠశాల, నిర్మల్

బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి...



బాస్కెట్‌బాల్‌ను ఎలా ఆడాలో మా పీఈటీ సార్ నేర్పించారు. ఆటలతో ఆరోగ్యంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉంటుందని మాసార్లు చెప్పారు. మైదానంలో బాస్కెట్‌బాల్ ఆడడంలోని మెలకువలు శిక్షణ ద్వారా నేర్చుకున్నాం. ప్రతీరోజు సాయంత్రం సాధన చేస్తుండడంతో ఆటలో పరిణతి సాధిస్తున్నాం. జోనల్ స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాం.

– నిషిత, 9వ తరగతి, తిమ్మాపూర్

వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకెళ్లాలి


పరీక్షలు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: ఆశ్రమ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వార్షిక ప్రత్యేక నమూనా పరీక్షలను పరిశీలించారు. ప్రతీరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. సీ, డీ కేటగిరి విద్యార్థులకు ప్రత్యేక కార్యచరణ ద్వారా బోధన చేయాలన్నారు. విద్యార్థులు చదువుకునే సమయంలో ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.

'నార్నూర్ సభకు అనుమతి ఇవ్వొద్దు'


డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: నార్నూర్‌లో ఈ నెల 13న గిరిజనేతరులు తలపెట్టిన సభకు అనుమతి ఇవ్వొద్దంటూ ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం డీఎస్పీ నాగేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అమలులో ఉన్న పెసా, భూబదలాయింపు చట్టాలు ఎవరి దయా దక్షిణ్యాలతో రాలేదని, ఆదివాసీ పోరాట యోధుల త్యాగాల వల్ల వచ్చాయన్నారు. ఈ చట్టాల జోలికి వస్తే మరో కొమురంభీం పోరాటం చేస్తామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు హెచ్చరించారు. సమావేశంలో ఆదివాసీ సంఘాల ప్రతినిదులు ఉమేశ్, అర్క గంగారాం, ఆత్రం మారుతి, మెస్రం ఆనంద్, ఆత్రం ప్రకాశ్, మడావి బాలాజీ, పెందూర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టించిన గ్రామస్తులు

- పరారీలో మరో ముగ్గురు
- రెండు బైక్‌లు స్వాధీనం

గుడిహత్నూర్: తెల్లవారు జామున ఓ పాన్‌షాప్‌లో చోరీకి పాల్పడుతున్న దొంగలను గుర్తించిన యజమాని, గ్రామస్తులు కలిసి వారిలో ఒక దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన మండలంలోని తోషం గ్రామంలో చోటు చేసుకుంది. టాకీగూడకు చెందిన విజయ్ తోషం గ్రామ శివారులో పాన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం దుకాణం మూసేసి ఇంటికి వెళ్లి పోయాడు. సోమవారం తెల్లవారు జామున రెండు బైకులపై వచ్చిన ముగ్గురు దొంగలు దుకాణం తలుపులు పగులగొట్టేందుకు యత్నిస్తుండగా హైదరాబాద్ నుంచి టాకీగూడ వెళ్తున్న అదే గ్రామానికి చెందిన కారు డ్రైవర్ గణేశ్ గమనించి యజమాని దరాడే విజయ్‌కు సమాచారం అందించాడు. వెంటనే విజయ్ తన తమ్ముడు అజయ్‌ను వెంట తీసుకొని బైక్‌పై అక్కడికి చేరుకున్నాడు. వారిని చూసిన దొంగలు పారిపోయేందుకు యత్నించారు. వారిలో ఒకరిని పట్టుకోగా మిగతా ముగ్గురు పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించగా కానిస్టేబుల్ రాజన్న దొంగను అదుపులోకి తీసుకున్నారు. సదరు దొంగ పేరు సమీర్‌గా చెప్పినట్లు పోలీసులు తెలిపారు. వీరంతా జిల్లా కేంద్రంలోని చిలుకూరినగర్, వడ్డెర కాలనీకి చెందిన వారని, గతంలో మండలంలో జరిగిన కొన్ని దొంగతనాల్లో వీరి ప్రమేయం ఉందని ప్రాథమికంగా గుర్తించినట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు. మిగిలి వారిని సైతం త్వరలో పట్టుకుంటామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


పోలీసుల అదుపులో దొంగ

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


శివశంకర్ (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని జాతీయ రహదారి–363 శ్రీరాంపూర్ మందమర్రి బైపాస్ రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. సోమవారం సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ ఏరియా భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఓంద్ర శివశంకర్, సతీష్ ఆదివారం రాత్రి శ్రీరాంపూర్ నుంచి కారులో మందమర్రి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ మందమర్రి బైపాస్ జాతీయ రహదారిపై దొరగారిపల్లెకు సమీపంలో కారు డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. దీంతో కారు నడిపిస్తున్న సతీష్‌కు స్వల్ప గాయాలు కాగా ఓంద్ర శివశంకర్(32) అక్కడికక్కడే మృతిచెందాడు. శివకుమార్ కూలీ పని చేస్తుండేవాడు. అతడికి భార్య ఉంది. మృతుడి బంధువు గుమాస కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో ఇద్దరి రిమాండ్

కాసిపేట: మండలంలోని పెద్దనపల్లికి చెందిన చెండే నవీన్‌పై బీరుసీసాతో దాడి చేసిన పల్లె పెద్దులు, సోమని గణేశ్‌లను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఎన్నికల ముందు పాతకక్షలతో బీరుసీసా పగుల గొట్టి దాడి చేయడంతో నవీన్‌కు తీవ్రగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


అర్జీలు స్వీకరిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. నార్నూర్ మండలం కొత్తపల్లికి చెందిన అమితాబాయి అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని, నాగల్కొండ గ్రామానికి చెందిన రాథోడ్ రాహుల్ ప్యాకింగ్ పరిశ్రమ కొరకు రుణం మంజూరు చేయాలని, ఉట్నూర్ మండలం టక్కుగూడకు చెందిన మెస్రం తిరుమల గురుకుల కళాశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కోసం, ఇచ్చోడ మండలం మాన్కాపూర్‌కు చెందిన వెడ్మ రమ్య వైద్య చికిత్సకు ఆర్థికసాయం అందించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్రూం ఇండ్లు, స్వయం ఉపాధి, పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుడ్మ బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్సీవో గంగాధర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెరుచుకోని పాఠశాల..


సాయినగర్ తండాలో మూసి ఉన్న పాఠశాల

నర్సాపూర్(జి): మండలంలోని సాయినగర్ తండా, అంజనీతండా, దర్యాపూర్, అర్లి(కె) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, గొల్లమాడ ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయ (ఒక ఉపాధ్యాయుడు) పాఠశాలలుగా నడుస్తున్నాయి. సోమవారం సాయినగర్ తండా ఉపాధ్యాయుడు పాఠశాలకు సెలవు పెట్టడంతో గది తలుపులు తెరుచుకోలేదు. దీంతో ఇక్కడ చదువుతున్న 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినపుడు మరొకరికి బాధ్యతలు అప్పగించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయంలో కార్తీక బహుళ చతుర్దశిని పురస్కరించుకుని కార్తీకమాసం చివరి సోమవారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నిమ్మగడ్డ శరత్‌చంద్రశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. – ఖానాపూర్

వేతనాలు వస్తేనే విధులకు హాజరవుతాం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

తాంసి(బోథ్): తమకు వేతనాలు వస్తేనే విధులకు హాజరవుతామని భీంపూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. వేతనాలు వచ్చే వరకూ విధులకు హాజరయ్యేది లేదన్నారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు ప్రేంసాగర్, స్వామి, అనుసూయ, రామేశ్వర్, గంగాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య


వైష్ణవి మృతదేహం

లక్సెట్టిపేట: తల్లిదండ్రులు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని మోదెలలో గాంధీనగర్‌కు చెందిన సావనపెల్లి సురేష్, తిరుమల దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. సురేష్ ఆటో నడుపుతుండగా తిరుమల ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తోంది. పెద్ద కుమార్తె వైష్ణవి(18) స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. చదువుపై ఇష్టంలేని వైష్ణవి కాలేజీకి వెళ్లనని చెప్పడంతో తల్లిదండ్రులు మందలించారు. సోమవారం ఉదయం తండ్రి ఆటోలో తీసుకెళ్లి కళాశాలలో దింపి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

శాస్త్రీయ విధానంలో బోధించాలి

- డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన


మీటింగ్‌లో పాల్గొన్న ఎంఈవో

ముధోల్: విద్యార్థులకు శాస్త్రీయ విధానంలో పాఠాలు బోధించేలా చూడాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన సూచించారని ఎంఈవో మైసాజీ తెలిపారు. సోమవారం ఎంఈవోలతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో డైరెక్టర్ ఎస్ఈఆర్టీతో కలిసి మాట్లాడారు. ఎఫ్ఎల్ఎస్, ఉన్నతి, ల క్ష్యను పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ప్రాథమిక దశ, ఉన్నత స్థాయిలోని విద్యార్థులకు విజ్ఞానశాస్త్ర పద్ధతిలో బోధించే సమయంలో అన్నిస్థాయిల్లో పరిశీలన చేసి తగు సలహాలు సూచనలు ఇవ్వాలని వివరించారు.

బంగారు గొలుసు అపహరణ

కాగజ్‌నగర్‌టౌన్: వృద్ధురాలి మెడలోనుంచి బంగారు గొలుసు అపహరించిన సంఘటన పట్టణంలోని సర్‌సిల్క్ ఎఫ్‌కాలనీలో చోటు చేసుకుంది. బాధితురాలు శకుంతల తెలిపిన వివరాల ప్రకారం తుక్కు సామగ్రి కొనుగోలు చేసే వ్యక్తి వృద్ధురాలి ఇంటికి వచ్చాడు. సామగ్రి విక్రయిస్తుండగా ఇనుప రాడ్‌తో చంపుతానని బెదిరించాడు. దీంతో వృద్ధురాలు కేకలు వేయగా మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ బుద్దే స్వామి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.